క్లుప్తంగా

నేడు గోదారంగనాథ స్వామి కల్యాణం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని కాశీబుగ్గ, వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో గోదా అమ్మవారికి, రంగనాథస్వామికి శనివారం ఉదయం 10 గంటలకు కల్యాణం జరుగనుందని ఆలయ ధర్మకర్త జగన్మోహనాచార్యులు శుక్రవారం తెలిపారు. అలాగే చింనాపట్నం గోమతం ఆచార్యులు జగన్మోహనాచార్యులచే ప్రవచన కల్యాణ వాఖ్యానం ఉంటుందని పేర్కొన్నారు. కల్యాణ ఘట్టంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకాగలరని కోరారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజు



నియామకపత్రం అందుకుంటున్న రాజు

మహేశ్వరం: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని చిన్నతూప్ర గ్రామానికి చెందిన గొల్లూరు రాజు నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి.. రాజుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి గ్రామ యూత్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాలను నియమించి పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరు చేస్తామన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా అందరు నాయకులను కలుపుకొని ముందుకు పోతామన్నారు. తనపైన నమ్మకంతో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కట్టబెట్టి బాధ్యతలు అప్పగించిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఠాక్రేకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్



శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జిగా నియమితులైన మాణిక్‌రావు ఠాక్రేను శుక్రవారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ, ప్రధాన కార్యదర్శులు, నాయకులు సన్మానించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని మాణిక్‌రావు ఠాక్రేకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

గాలిపటాలు ఎగురవేస్తున్నారా.. జాగ్రత్త

హుడాకాంప్లెక్స్: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహుళ అంతస్తులపై పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా పక్కన ఉండాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు లేని ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. అదే విధంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో విద్యుత్ వైర్లకు చుట్టుకోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, కావున జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా డీఈ వివరించారు.

కంకర పోసి.. వదిలేశారు

- ప్రశాంతిహిల్స్– టీచర్స్ కాలనీ రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం
- కంకర వేసి వదిలేయడంతో వాహనదారులకు అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మీర్‌పేట నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వెళ్లే రోడ్డుపై వేసిన కంకర

మీర్‌పేట: విస్తరించేందుకు రోడ్డును తవ్వారు... నెలల పాటు అలాగే వదిలేశారు.. అప్పుడు గుంతలు... ఇప్పుడు కంకరతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు... వదిలేసిన సగం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేదెప్పుడు..? వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్ చౌరస్తా నుంచి టీచర్స్‌కాలనీ (మీర్‌పేట–బీఎన్‌రెడ్డి నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి) వరకు గల రహదారి విస్తరణకు ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ముందుగా ప్రశాంతిహిల్స్ చౌరస్తా నుంచి నందిహిల్స్ చౌరస్తా వరకు విస్తరణ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్ సగం రోడ్డును తవ్వి కొంత కాలం పాటు అలాగే వదిలేశాడు. దీంతో గుంతల రహదారిపై ప్రయాణించి వాహనదారులు అవస్థలు పడ్డారు. సగం రోడ్డును కూడా త్వరితగతిన పూర్తిచేయాలని అటు వాహనదారులు, ఇటు కాలనీలవాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

పూర్తయ్యేదెన్నడో...?

వదిలేసిన సగం రహదారి విస్తరణ పనులను మొదలుపెట్టేందుకే సదరు కాంట్రాక్టర్ దాదాపుగా ఆరు నెలల సమయం తీసుకున్నాడని.. ప్రస్తుతం కంకర వేసి పది రోజులవుతోందని, ఇంతవరకు పనుల్లో పురోగతి లేదని స్థానికులు తెలిపారు. కంకర వేసి వదిలేయడంతో సమస్య మరింత జఠిలంగా మారిందని, ఇదివరకు గుంతల రహదారిపై ఎలాగోలా తిప్పలు పడుతూ ప్రయాణించే వారమని.. కానీ ప్రస్తుతం రహదారిపై ప్రయాణం నరకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో విపరీతమైన దుమ్మూ, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక షాపుల యజమానులు, వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం



టీచర్స్ కాలనీ వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు సగంలో ఆగిన మాట వస్తావమే. త్వరలోనే విస్తరణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇస్తాం. పనులు వేగంగా పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగిస్తాం.

– నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట

స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయండి

మీర్‌పేట: కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ 36వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్ శుక్రవారం కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల డివిజన్ పరిధిలోని కాలనీల్లో నూతనంగా 12 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందని.. వెంటనే ఇట్టి స్తంభాలకు లైట్లు, హాంగులర్స్ మంజూరు చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మల్లేశ్

శ్రీవాణికి బుద్ధి చెప్పడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్

కందుకూరు: సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డిపై సోషల్ మీడియాలో నిత్యం పోస్టులు పెడుతూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏరోజూ కూడా తను ప్రాతినిధ్యం వహిస్తున్న సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధి కోసం పట్టణ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కాని, స్థానిక మంత్రి సబితారెడ్డి కాని కలవని శ్రీవాణి వారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తన డివిజన్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని ఆమె పెద్ద నాయకుల గురించి మాట్లాడితే, తాను పెద్ద నాయకురాలిని అవుతానని కలలు కంటున్నారన్నారు. ఇదే తరహాలో అసత్య ప్రచారాలు చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, సీనియర్ నాయకులు కాకి దశరథ, అశోక్, జంగయ్య, మోహన్‌రెడ్డి, తాళ్లకార్తీక్, సామయ్య, బొక్క దీక్షిత్‌రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, నవీన్, ఆలీ, కాసోజు ప్రశాంత్‌చారి, రామకృష్ణ, తేజనాయక్, హనుమంత్, ఉమాకాంత్‌రెడ్డి, నరేష్, నర్సింహ, ప్రభాకర్, షకీల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి

మంత్రి సబితారెడ్డి



కందుకూరు: సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కందుకూరు: మండలంలోని ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ గ్రామ సర్పంచ్ డాక్టర్ ఇ.రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కాస నర్సింహ, పార్టీ స్థానిక నాయకులు బండ నరసింహ, చిప్పల రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వారంతా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కాగా పార్టీలో బొర్ర శ్రీలత, బొర్ర సంధ్య, బొర్ర శశికళ, జోగు యశోధ, నందిగామ చంద్రయ్య, సత్యమ్మ, నరేందర్, లక్ష్మమ్మ, సురేష్, లక్ష్మయ్య, రాధిక, ఊటు జంగయ్య, ఊటు రాజు, నందిగామ అంజమ్మ, వారణాసి రాజు, శ్రీరాములు తదితరులు చేరారు.

బీసీలకు సముచిత స్థానం..

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించి గౌరవిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండెమోని అంజయ్యని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శిగా నియమిస్తూ మంత్రి సబితారెడ్డి నియామకపత్రం అందజేశారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి పదవులు కట్టబెట్టి గుర్తింపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, కందుకూరు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్, అమీర్‌పేట్ ఎంపీటీసీ రాయప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవవరం గౌడ్, ఉపసర్పంచ్ నర్సింగ్, మండల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరిగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహ, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బ్రదర్ షఫీ
- కందుకూరులో యువతకు అవగాహన సదస్సు



వ్యక్తిత్వ వికాస నిపుణుడు షఫీతో నాయకులు, యువకులు

కందుకూరు: కందుకూరు పీఎస్ సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం యూత్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బ్రదర్ షఫీ, ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వరరావు ప్రత్యేకంగా హాజరై యువతకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువతతోనే దేశభవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. దేశంలో 60 శాతంకు పైగా యువత ఉందని, యువత సన్మార్గంలో నడిస్తే దేశం పురోగమిస్తుందన్నారు. నిరాశ, నిస్పృహలను వీడి ఆశావహదృక్పథంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పోలీస్ ట్రయినింగ్ టీటీఐ జోసెఫ్ గంజాయి, డ్రగ్స్ వంటి వాటితో ఏర్పడే దుష్ప్రభావాలు, డేంజరస్ డ్రైవింగ్‌తో ఏర్పడే ప్రమాదాలను గురించి దృశ్యమాధ్యం ద్వారా యువతకు వివరించారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు తన పాటల ద్వారా గంజాయి, నీలిమందు వంటి చెడు అలవాట్లకు లోనుకావద్దంటూ అవగాహన కల్పించారు. అనంతరం యువతకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. కాగా మహ్మద్‌నగర్‌కు చెందిన ఆసిఫ్‌జానీ యువకులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఎంపీటీసీలు సురేష్, మల్లేష్, రాజశేఖర్‌రెడ్డి, ఇందిర, రాములు, సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, ఎస్‌ఐలు శ్రావణ్, కొండల్, నాగరాజు, నరేష్, ఆయా పార్టీల నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, డి.రాంచందర్, జయేందర్, బి.శ్రీనివాస్, కాకి దశరథ, ఎ.పాండు, రేవంత్‌రెడ్డి, శ్రీధర్, అఫ్జల్‌బేగ్, సామయ్య, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, శ్రీహరి, అశోక్, శేఖర్‌గుప్తా, మోహన్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట, మీర్‌పేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి సబితారెడ్డి



బడంగ్‌పేట్: బడంగ్‌పేట, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు రూ.11.36 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు అయినట్లు శుక్రవారం విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని బడంగ్‌పేట క్రాస్ రోడ్డునుంచి సీకేఆర్, టీకేఆర్ ఫంక్షన్‌హాల్ మీదిగా బాలాపూర్ వరకు రూ.30 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. అలాగే బాలాపూర్ క్రాస్ రోడ్డు నుంచి నాదర్‌గుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు రూ.2.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు అయినట్లు వెల్లడించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయం నుంచి గుర్రంగూడ క్రాస్ రోడ్డు వరకు రూ.1.20 కోట్లతో లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. రూ.45 లక్షలతో బడంగ్‌పేటలోని అయ్యంగారి బేకరి నుంచి అల్మాస్‌గూడ కమాన్ వరకు, అలాగే రూ.50 లక్షలతో అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు నుంచి బీఎన్‌రెడ్డి వరకు వీధిదీపాల ఏర్పాటుకు నిధులు విడుదల అయినట్లు తెలిపారు. మల్లాపూర్ క్రాస్ రోడ్డు నుంచి కుర్మల్‌గూడ, నాదర్‌గుల్, మీదిగా గుర్రంగూడ వరకు రూ.1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్మాస్‌గూడ వరకు రూ.37 లక్షలతో వీధిదీపాల ఏర్పాటుకు సుగుమం అయిందన్నారు.

మీర్‌పేట్ కార్పొరేషన్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో మంత్రాల చెరువు సుందరీకరణ కోసం రూ.2 కోట్లు మంజూరు అయినట్లు వెల్లడించారు. మరో కోటి రూపాయలతో మంత్రాల చెరువులో లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లెలగూడలోని స్వాగత్ గ్రాండ్ నుంచి నందనవనం వరకు రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రశాంతిహిల్స్ నుంచి విజ్ఞాన్‌పూరి కాలనీ వరకు రూ.76 లక్షలతో సెంట్రల్ వీధిలైట్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మొత్తంగా మీర్‌పేట్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లకు కలిపి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.11.36 కోట్లు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయినట్లు మంత్రి సబితారెడ్డి వివరించారు. ప్రజలకు మంత్రి సబితారెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న సుభాన్‌యాదవ్, పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శుక్రవారం విశేష అన్నదానం నిర్వహించారు. నాదర్‌గుల్ వాసి బడంగ్‌పేట్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకుని దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి విచ్చేశారు. దివ్యాంగులకు దగ్గరుండి వడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషి, మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు, అంకంగారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు..

నాదర్‌గుల్ నుంచి బడంగ్‌పేటకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా ఉందని తెలిసి శుక్రవారం సుభాన్‌యాదవ్ తన సొంత డబ్బుతో రోడ్డు మరమ్మతులు చేయించారు. ఇలాగైన స్థానిక మంత్రి సబితారెడ్డికి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులకు కళ్లు తెరిపించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో బంగారు మురళి, కొరాడి శ్రీశైలం, జనార్ధన్, అరుణ్‌రెడ్డి, టిల్లు, నగేష్, నవీన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీపీ మంద జ్యోతిపాండు ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంకట్రాములు శుక్రవారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ స్థాయిలో 29 శాఖలకు సంబంధించిన సమాచారం మొత్తం సేకరించి 2023–24 సంవత్సరం ప్రణాళికను తయారు చేయాలన్నారు. వాటి వివరాలను ప్రభుత్వ యాప్‌లో పొందుపర్చాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు

- ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, విద్యార్థులు
- గాలిపటాల దుకాణాల వద్ద సందడి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 26వ డివిజన్‌లో శ్రీహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ముఖ్యులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో శ్రీహిల్స్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్యం ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో వడుకలకు హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో వేసిన ముగ్గులు, సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపే భోగిమంటలు, హరిదాసుల సంకీర్తనలు గొబ్బెమ్మల అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ఆవరణలో రంగవల్లులు వేశారు. అనంతరం ఉత్తమ ముగ్గులు వేసిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ జి.సైదులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

రైతుల పండుగ..

పహాడీషరీఫ్: ధాన్యం చేతికొచ్చే సంక్రాంతి పండుగను ముఖ్యమంత్రి కేసీఆర్.. రైతులు సంతోషంగా జరుపుకునేలా చేదోడు వాదోడుగా ఉంటున్నారని బడంగ్‌పేట్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగనాయకుల కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో పాల్గొన్న ఆయన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధులు మనోహర్, పూజ, ఆవుల స్టీవెన్, నాయకులు గాయాల శ్రీరాములు, గుర్జని సురేష్ గౌడ్, గుండాల సదానంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

షాపుల వద్ద సందడి..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని షాపుల వద్ద సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద ఏర్పాటు చేసిన రకరకాల గాలిపటాలు ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం యువత పెద్ద ఎత్తున గాలిపటాలు, మాంజా కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర్చారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మకర సంక్రాంతి పండుగ వేడుకల సందర్భంగా తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న పలు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: గాలిపటాలు కొనుగోలు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి



బడంగ్‌పేట్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామిడి రాంరెడ్డి



మీర్‌పేట: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ సైదులు



పహాడీషరీఫ్: ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్